ప్రజాశక్తి
బుధవారం 28 మే 2025
5
విజయనగరం



జిల్లా వ్యాప్తంగా వర్షాలు

ప్రజాశక్తి-విలేకర్ల యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా మంగళవారం వర్షాలు కురిశాయి. కొన్ని మండలాల్లో కుండపోతగా వర్షం కురిసింది. విజయనగరంలో మంగళవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో సుమారు అరగంటపాటు వర్షం కురిసింది. సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రివరకు చిరుజల్లులు కురిశాయి. రామభద్రపురంలో సుమారు గంటకు పైగా భారీవర్షం పడింది. దీంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. కొత్తవలస, గజపతినగరం మండలాల్లో కుండపోతగా వర్షం కురిసింది. బాడంగి, మెరకముడిదాం, మెంటాడలో మోస్తరు వర్షం కురిసింది.

ఉద్యోగుల్లో బదిలీల గుబులు



ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల్లో బదిలీల గుబులు మొదలైంది. తమను ఎక్కడికి పంపేస్తారో అన్న భయంతో కొందరు ఉంటే, ఎక్కడైనా ఉద్యోగమే కదా? అన్నట్లు మరికొందరు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు, పనిలో సమర్థత ఆధారంగానే బదిలీలు ఉంటాయని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ గడిచిన వారం రోజులుగా సమావేశాల్లో చెబుతున్నారు. రాజకీయ సిఫార్సుల కన్నా ప్రభుత్వ అవసరాలను గుర్తులో పెట్టుకుంటామని కూడా క్లారిటీ ఇచ్చారు. ఈనేపథ్యంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు జోక్యం చేసుకోకపోతే అన్ని శాఖల్లోనూ మెరుగైన ప్రజాసేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

- పారదర్శకంగా జరుగుతాయంటున్న కలెక్టర్
- సిఫార్సులు పక్కన బెడితేనే మెరుగైన సేవలు
- రాజకీయ నాయకుల జోక్యం పెరిగితే తిప్పలే

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల బదిలీల విషయమై ఈ నెల 15న మానవ వనరులు – ప్రజాసేవల శాఖ జిఒ ఎంస్ నెంబర్ 23ను జారీచేసిన విషయం విదితమే. దీని ప్రకారం జూన్ 2వ తేదీ నుంచి బదిలీలు మొదలవుతాయి. దాదాపు అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల సర్వీసు, తదితర వివరాలను తయారు చేసి సంబంధిత శాఖ ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్‌కు సమర్పించే పనిలో ఉన్నారు. ఈనేపథ్యంలో ఉద్యోగుల నోట ఎక్కువగా బదిలీల మాటే వినిపిస్తోంది. గత ప్రభుత్వంలో ఇలా రాజకీయ సిఫార్సులతో పోస్టింగులు సాధించుకున్న వారిలో ఎక్కువ మంది అదే రకమైన పలుకుబడితో మిగిలిన వారిని తమదారిలో పెట్టుకోవడం లేదా బయటపెట్టడం వంటివాటితో కాలక్షేపం చేశారు. విధి నిర్వహణలో వెనుకబాటు లేదా అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఇలాంటి ఉద్యోగులు ఉన్న శాఖల్లో ప్రభుత్వ లక్ష్యాలు చేరుకోవడంలో వెనుకబాటుకు దారి తీసింది. నిన్నమొన్నటి వరకు డ్వామా, అంతకు ముందు వయోజన విద్య తదితర విభాగాల్లో ఇటువంటి పరిస్థితి ఎదురైంది కూడా. ఇవి మచ్చుకు మాత్రమే. ఈసారి అటువంటి పరిస్థితి లేకుండా చూసేందుకు అత్యంత పారదర్శకంగా బదిలీలు చేపడతామని కలెక్టర్ చెబుతున్నారు. ఉద్యోగుల సర్వీసు, పనితీరు తదితర అంశాలతో కూడిన నివేదికలు ఒకటికి రెండు సార్లు పరిశీలించుకోవాలని జిల్లా అధికారులకు ఇటీవలే దిశానిర్దేశం చేశారు. వాస్తవానికి వ్యక్తిగత ఇబ్బందులు ఉన్న ఉద్యోగులకు ప్రభుత్వమే కొన్ని మినహాయింపులు ఇచ్చింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం... ఒక గ్రామం లేదా పట్టణంలో ఐదేళ్ల కాలపరిమితి దాటిన వారికి తప్పనిసరిగా బదిలీ ఉంటుంది. ఈనెల 31న లేదా అంతకు ముందు ఉద్యోగ విరమణ వయస్సు వచ్చిన తర్వాత వారిని సాధారణంగా అభ్యర్థన లేదా పరిపాలన కారణాల వల్ల తప్ప బదిలీ చేయరు. దృష్టి లోపం ఉన్నవారు, మానసిక వికలాంగులైన పిల్లలు ఉండి, వారి వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్న గ్రామం లేదా పట్టణాలకు బదిలీ కోరుకుంటే ప్రాధాన్యతనిస్తారు. గిరిజన ప్రాంతాలలో రెండు సంవత్సరాలకు పైగా పనిచేసిన ఉద్యోగులు, 40 శాతం లేదా అంతకు మించిన వైకల్యం ఉన్న ఉద్యోగుల అభ్యర్థనకు కూడా ప్రాధాన్యత ఉంటుంది.

పని ఆధారంగానే బదిలీలు



పనిలో సమర్థత, ప్రభుత్వ అవసరాల మేరకే ఉద్యోగుల బదిలీలు ఉంటాయి. అందుకే రాజకీయ సిఫార్సుల వరకు వెళ్లవద్దని ఉద్యోగులకు పదేపదే చెబుతున్నాం. బదిలీల కోసం ఎవరినీ ఆశ్రయించాల్సిన అవసరం లేదు. వారి సర్వీసు, ఇప్పటి వరకు పనిచేసిన ప్రాంతాలు తదితర వివరాలన్నీ జిల్లా అధికారుల నుంచి నాకు గానీ, ఆయా శాఖల కమిషనరేట్లకు గానీ అందుతాయి. అందరూ అన్ని ప్రాంతాల్లోనూ, స్థాయికి తగిన పోస్టుల్లోనూ పనిచేయడానికి సిద్ధంగా ఉండాలి. ఇందుకనుగుణంగానే నివేదికలు పంపాలని ఇప్పటికే జిల్లా అధికారులను ఆదేశించాం.

– డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జిల్లా కలెక్టర్

ఖరీఫ్‌కు సర్వం సిద్ధం

7 లోగా కౌలుదార్లకు గుర్తింపు కార్డులు : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రకృతి అనుకూలత వల్ల ఈ ఏడాది ముందుగానే వర్షాలు మొదలయ్యాయని, వీలైనంత వేగంగా విత్తనాలు చల్లి ఖరీఫ్ సీజన్‌ను మొదలు పెట్టాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులకు సూచించారు. ఖరీఫ్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు కూడా సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. తహశీల్దార్లు, మండల వ్యవసాయాధికారులతో తన ఛాంబర్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉందన్నారు. రైతు సేవా కేంద్రాలు, గోదాముల్లో కూడా వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. సీజన్‌కు అసవరమైన ఎరువులను కూడా ముందుగానే సిద్ధం చేశామన్నారు. అక్టోబరులోగా కోతలు పూర్తి చేసేలా వీలైనంత వేగంగా విత్తనాలు చల్లాలని సూచించారు. దీనివల్ల నవంబరులో వచ్చే తుపాన్ల ముప్పును తప్పించుకోవచ్చునని చెప్పారు. తద్వారా రబీ సీజన్ కూడా వీలైనంత త్వరగా మొదలు పెట్టే అవకాశం కలుగుతుందన్నారు.

జిల్లాలో ఈ ఏడాది సుమారు 16,500 మంది కౌలురైతులకు గుర్తింపుకార్డులు జారీ చేసి, వారికి రూ.150 కోట్ల రుణాలను ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. జూన్ మొదటి వారంలోగా ఈ గుర్తింపు కార్డుల పంపిణీని పూర్తి చేయాలని, ఆర్‌డిఒలు ప్రతిరోజూ సమీక్షించాలని ఆదేశించారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి సుమారు 4,89,116 మంది రైతుల వివరాలను తనిఖీ చేసి, అర్హుల జాబితా ఎంపిక ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తహశీల్దార్లు, మండల వ్యవసాయాధికారుల లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న పేర్లను రెండు రోజుల్లోనే తనిఖీ పూర్తిచేసి ఆమోదం తెలపాలని ఆదేశించారు. రైతుల ఆధార్ కార్డుల సవరణ, మార్పులు చేర్పులపైనా దృష్టి పెట్టాలని సూచించారు.

పిజిఆర్ఎస్‌లో రెవెన్యూకు సంబంధించి 1017 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని వారంలో రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ ఎక్కువగా ఉన్న తహశీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 47 రీఓపెన్ అర్జీలకు సంబంధించి, వారితో స్వయంగా మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కేంద్రం నుంచి జెసి ఎస్.సేతు మాధవన్, డిఆర్ఒ మురళి, వ్యవసాయ శాఖ జెడి విటి రామారావు, ఎల్‌డిఎం నారాయణమూర్తి, ఎపి సీడ్స్ డిఎం పద్మ, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కర్లాం వెంకట్రామ పౌల్ట్రీలో

స్థానికులకే ఉపాధి కల్పించాలి

ఉపాధి కల్పన కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన ధర్నా


ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

చీపురుపల్లి మండలం కర్లాం, అలజంగి గ్రామాల్లో 150 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న శ్రీవెంకట్రామ పౌల్ట్రీలో స్థానికులకే 75 శాతం ఉపాధి కల్పించాలని సిఐటియు ఆధ్వర్యంలో ఉపాధి కల్పన కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.వి.రమణ, ఎ.గౌరినాయుడు మాట్లాడుతూ 2011 వరకు నూరు శాతం స్థానికులకే ఉపాధి కల్పించిన యాజమాన్యం క్రమేపీ స్థానికులను తొలగించిందన్నారు. బీహార్, చత్తీస్‌గడ్, ఒడిశా, తదితర రాష్ట్రాలకు చెందిన 800 మంది కార్మికులతో పనిచేయిస్తోందని చెప్పారు. ప్రస్తుతం 200 మంది స్థానికుల్లో మార్చి 8న 30 మందిని తొలగించారని, వారిని బేషరతుగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై 40 రోజుల క్రితం ఉపాధి కల్పన అధికారికి వినతినిచ్చినా నేటికీ స్పందన లేదని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికులకే 75 శాతం ఉపాధి కల్పించాలని 2019లో జిఒ ఇచ్చినా.. కార్మిక శాఖ, ఉపాధి కల్పన శాఖ అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు జోక్యం చేసుకొని కార్మిక చట్టాలను ఉల్లంఘించిన యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శులు ఎ.జగన్మోహనరావు, బి.సుధారాణి, నాయకులు కిల్లంపల్లి రామారావు, వెంకట్రామ పౌల్ట్రీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఐ.గురునాయుడు, తొలగించిన కార్మికులు లక్ష్మి, అచ్చియ్యమ, అన్నపూర్ణ, వాసు, సీతాలక్ష్మి, గౌరి, మానస తదితరులు పాల్గొన్నారు.

చదువుకొనుడే



- ప్రభుత్వ నిబంధనలకు పాతర
- యథేచ్ఛగా ప్రయివేటు విద్యాసంస్థల దోపిడీ
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

ప్రభుత్వ విధానాల ఫలితంగా విద్యను వ్యాపారంగా మార్చుకున్న కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు.. తమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నాయి. 2025 -26 విద్యా సంవత్సరాన్ని విద్యా వ్యాపార సంవత్సరంగా మార్చేశాయి. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాయి. అడ్మిషన్ ఫీజులు, పుస్తకాలు, అధిక మొత్తంలో అడ్డూఅదుపూ లేని ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకు తింటున్నాయి.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు 500పైగా ఉన్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అడ్మిషన్ల పేరుతో ఇంటింటా ప్రచారం చేస్తూ తమ కళాశాలలు, పాఠశాలల్లో చేర్పించాలంటూ ఊదరగొడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు ప్రభుత్వ విద్యా వ్యవస్థను హేళన చేస్తూ తమ పాఠశాలలోనే అత్యాధునిక విద్య అందుతుందంటూ విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతున్నాయి. అందినంత దోచుకునే ప్రయత్నాల్లో తమ పాఠశాలలో విద్యాబుద్ధులు చెప్పే ఉపాధ్యాయులను బృందాలుగా ఏర్పాటు చేసి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు వల వేస్తున్నాయి.

నిబంధనలకు తిలోదకాలు

ప్రతి కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థ కూడా ముందు తాము వసూలు చేసే ఫీజుల వివరాలు, రవాణా ఛార్జీలు డిస్‌ప్లే బోర్డులో పెట్టాల్సి ఉంటుంది. జిల్లాలోని ఏ ప్రయివేటు విద్యా సంస్థ ముందు ఇలాంటి బోర్డులేవీ కనిపించవు. నిబంధనల మేరకు ఉపాధ్యాయులకు జీతాల చెల్లింపులు ఉండవు. ఏ విద్యాసంస్థ యాజమాన్యం కూడా తమ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు నెలకు రూ.15 వేలకు మించి జీతాలు ఇవ్వడం లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రూ.వేలు, లక్షల్లో ఫీజులు వసూలు చేసే విద్యాసంస్థలు తమ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు మాత్రం తక్కువ జీతాలు ఇస్తూ వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాయి.

యథేచ్ఛగా పుస్తకాలు, యూనిఫాం అమ్మకాలు

ప్రతి విద్యా సంవత్సరం స్టేషనరీ పేరుతో కార్పొరేట్ ప్రయివేటు విద్యాసంస్థలు లక్షలాది రూపాయలు దండుకుంటున్నాయి. ప్రయివేటు విద్యాసంస్థల్లో ఎలాంటి నోటుపుస్తకాలు, అచ్చు పుస్తకాలు విక్రయించరాదనే నిబంధనలు ఉన్నా ఎక్కడా పాటించడం లేదు. ఇష్టానుసారం పుస్తకాలు, యూనిఫాం, ఇతర స్టేషనరీ పేరుతో దోచుకుంటున్న ఈ విద్యాసంస్థలను ప్రశ్నించే నాథుడే కరువయ్యారు. కట్టడి చేయాల్సిన ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో వీరి దోపిడీకి విద్యార్థుల తల్లిదండ్రులు బలైపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల దోపిడీ నుంచి రక్షించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

పిడుగు పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-లక్కవరపుకోట



సన్నిబాబు (ఫైల్)

పిడుగు పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని కసిరెడ్డిపాలెంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... చందులూరి గ్రామ శివారులో ఉన్న కసిరెడ్డిపాలేనికి చెందిన కసిరెడ్డి సన్నిబాబు(63) మంగళవారం మధ్యాహ్నం పశువుల తోలుకొని పొలంలోకి వెళ్లాడు. సాయంత్రం ఐదు గంటల సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం వచ్చింది. దీంతో పశువులను తోలుకొని తిరిగి వస్తుండగా పిడుగు పడటంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు.

ఆ గ్రామాల్లో ఫ్లోరైడ్ సమస్య

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రాజాం నియోజకవర్గ పరిధిలోని రాజాం, సంతకవిటి, వంగర, రేగిడి మండలాల్లో 25 గ్రామాల్లో ఫ్లోరైడ్ సర్వే చేపట్టామని డిఎంహెచ్ఒ జీవనరాణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉన్న గ్రామాలుగా అధికారులు గుర్తించారు. ఈ గ్రామాల్లో నివశిస్తున్న 30 మంది పిల్లలను, 58 మంది పెద్దలను ఫ్లోరైడ్ అనుమానిత బాధితులుగా తేల్చారు. ఇందులో ముగ్గురు పిల్లలు, ఆరుగురు పెద్దలకు డెంటల్ ఫ్లోరోసిస్ ఉన్నట్లుగా గుర్తించారు. ఇద్దరు పెద్దలకు ఫ్లోరోసిస్ ఉన్నట్లు నిర్ధారించారు. వీరికి కాల్షియం మల్టీ విటమిన్ మాత్రలు అందించారు. నడవలేని వారికి వీల్ చైర్స్, టాయిలెట్ కమోడ్స్ ఇచ్చారు. ఆ గ్రామాలకు వెళ్లి ఫ్లోరైడ్ ఎక్కువగా ఉండడానికి కారణాలను ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకోవాలి, ఎలాంటివి తీసుకోకూడదనే వాటిపై అవగాహన కల్పించినట్లు డిఎంహెచ్ఒ వివరించారు.

30న డిఎస్‌సి మోడల్ పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 30న నిర్వహించే డిఎస్‌సి మోడల్ టెస్ట్‌ను విజయవంతం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్ కోరారు. మంగళవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం ఎస్‌జిటి అభ్యర్థులకు మాత్రమే ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రశ్నపత్రాన్ని మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు తయారు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే డిఎస్‌సి పరీక్షకు ఈ నమూనా పరీక్ష ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మోడల్ పరీక్ష జరుగుతుందని, విజయనగరంలో గురజాడ గ్రంథాలయంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. రూ.50 ప్రవేశ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 8019273486, 7095956895 నెంబర్లను సంప్రదించాలని కోరారు. 30న ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, 9.30 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బి.సతీష్ పాల్గొన్నారు.

29న కెజిబివి నాన్ టీచింగ్ పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని కెజిబివి, ఆదర్శ పాఠశాలల్లో ఆఫ్‌లైన్ ద్వారా నాన్-టీచింగ్ పోస్టులకు ఈ నెల 29న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష ఎపిసి ఎ.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. చౌకీదార్ కుక్, డే వాచ్ ఉమెన్ /నైట్ వాచ్ ఉమెన్, స్కావెంజర్, స్వీపర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్సు కాపీలతో విజయనగరంలోని కంటోన్మెంట్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు రావాలని చెప్పారు. అర్హత కలిగిన అభ్యర్థుల జాబితా https://vizianagaram.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామని వెల్లడించారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

విజయనగరం టౌన్ : ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు బదిలీ కోసం బ్యాంకు ఖాతాకు ఆధార్ నంబర్ అనుసంధానం తప్పనిసరని పోస్టల్ శాఖ విజయనగరం డివిజన్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించే సంక్షేమ పథకాల నగదు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు ఈ ప్రక్రియ ప్రారంభించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో పోస్టల్, సచివాలయ యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సమన్వయంతో జూన్ 5వ తేదీలోగా అందరికీ ఆధార్ సీడింగ్‌తో పాటు ఎన్‌పిసిఐ అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఆధార్ సీడింగ్ జరిగిన ఐపిపిబి ఖాతాలో జమైన పథకాల నగదును ఏ పోస్టాఫీసులో అయినా తీసుకునే సదుపాయం ఉంటుందని చెప్పారు.

యోగాంధ్రలో 85 వేల మంది నమోదు

- 30న రామనారాయణంలో వెయ్యి మందితో యోగా : జెసి
- యోగాంధ్రపై బాడంగిలో భారీ ర్యాలీ
- రామభద్రపురంలో మానవహారం

ప్రజాశక్తి-విలేకర్ల యంత్రాంగం



బాడంగిలో యోగాంధ్ర కార్యక్రమానికి హాజరైన జనం

జిల్లా నుంచి ఇప్పటివరకు 85 వేల మంది యోగాంధ్ర పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ వెల్లడించారు. జిల్లాలో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారిని పెద్ద ఎత్తున భాగస్వాములను చేస్తూ, వారిని యోగాంధ్ర పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో 7.8 లక్షల మందిని యోగాంధ్రలో భాగస్వాములుగా చేయాలని లక్ష్యంగా నిర్ణయించామని, ప్రతిరోజూ కనీసం 50 వేల మందిని నమోదు చేయాలని చెప్పారు. జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, ప్రత్యేక అధికారులతో జాయింట్ కలెక్టర్ మంగళవారం యోగాంధ్ర కార్యక్రమంపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 5270 మంది ట్రైనర్లుగా నమోదు చేసుకున్నారని, వీరందరికీ మంగళవారం నుంచి 31 వరకు ఐదు రోజులపాటు ఆయా మండలాల్లో శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. మాస్టర్ ట్రైనర్లు వీరికి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 30న పర్యాటక ప్రాంతాల్లో యోగాంధ్ర నిర్వహణలో భాగంగా రామనారాయణంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో వెయ్యి మంది భాగస్వాములవుతున్నారని, అన్ని ప్రభుత్వ శాఖలు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అన్ని మండలాల్లోనూ యోగాంధ్ర పోటీలను వెంటనే ప్రారంభించి ఫలితాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని జెసి ఆదేశించారు.

రామనారాయణంలో యోగాంధ్ర కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించే నిమిత్తం మంగళవారం డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి నేతృత్వంలో పర్యాటక అధికారి కుమారస్వామి, డిఎంహెచ్ఒ జీవనరాణి, ఆయుష్ అధికారి ఆనందరావు తదితరులు సందర్శించారు.

జిల్లాలోని పలు మండలాల్లో యోగాంధ్రపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. బాడంగిలో సుమారు రెండు వేల మంది ఉద్యోగులు, యువతీ యువకులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక జెడ్‌పి హైస్కూల్ ఆవరణలో యోగాసనాలు ప్రదర్శించారు.

రామభద్రపురంలో యోగాంధ్రపై మానవహారం నిర్వహించారు. జెడ్‌పి హైస్కూల్ ఆవరణలో యోగాసనాలు ప్రదర్శించారు. వంగరలో యోగాంధ్రపై ర్యాలీ, యోగాసనాల ప్రదర్శన చేపట్టారు. గజపతినగరం మండలం పురిటిపెంట బాలికోన్నత పాఠశాలలో యోగాసనాల ప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించారు.

విజయనగరంలో మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య ఆధ్వర్యంలో రెండో రోజూ యోగా స్ట్రీట్ కార్యక్రమాన్ని పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించారు. పట్టణ ప్రజలు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన యోగాసనాల ప్రదర్శనలో పాల్గొన్నారు.

అనర్హులకు కేటాయించిన ఇళ్లు రద్దు

11 వేల గృహాలను ప్రవేశాలకు సిద్ధం చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్


పేదలకు గృహ నిర్మాణాల కోసం ప్రభుత్వం అదనపు నగదు మంజూరు చేసిందని, అయినా ఇళ్ల నిర్మాణాలకు ముందుకురాని లబ్ధిదారులను పరిశీలించాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. వారికి సొంతిళ్లు ఉండటంతోనే గృహ నిర్మాణాలకు ముందుకు రావడం లేదని తెలుస్తోందని చెప్పారు. దీనిపై ఆధారాలతో సహా రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అలాంటి వారికి మంజూరైన గృహాలను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. గృహ నిర్మాణ శాఖ ఇంజినీర్లతో మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండలాల వారీగా సమీక్షించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద మంజురైన 11 వేల గృహాలను గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. 11 వేలకు గానూ ఇప్పటి వరకు 41 శాతం మాత్రమే పూర్తయ్యాయని, ఇంకా 6,924 గృహాలు పూర్తి కావాల్సి ఉందని చెప్పారు. బొబ్బిలి, విజయనగరం అర్బన్‌లో తక్కువ గృహాలు పూర్తి కావడంపై వివరణ అడిగారు. నీటి సరఫరా లేదని, వేసిన బోర్లు దొంగతనానికి గురయ్యాయని, మున్సిపల్ కమిషనర్లకు లేఖ రాశామని హౌసింగ్ పీడీ మురళీమోహన్ తెలిపారు. రెండు రోజుల్లో బోర్లన్నీ పని చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇకపై రోజు వారీ లక్ష్యాలను నిర్దేశించుకొని పనులు వేగం పెంచాలని, ప్రతి వారం సమీక్షిస్తామని తెలిపారు. ఇళ్ల స్థలాల కోసం గతంలో ఇచ్చిన 4096 దరఖాస్తులను తనిఖీ చేయాలన్నారు. మాన్యువల్‌గా వచ్చిన మరో 2500 దరఖాస్తులను కూడా తహశీల్దార్లతో సమన్వయం చేసుకొని అర్హతను పరిశీలించాలని చెప్పారు. హౌసింగ్ శాఖ అధికారులు, సిబ్బంది, వారి లబ్ధిదారులంతా యోగాంధ్రలో రిజిష్టర్ కావాలని కోరారు. ఈ సమావేశం లో హౌసింగ్ పీడీ మురళీ మోహన్, ఇఇలు, డిఇలు, జెఇలు పాల్గొన్నారు.



హౌసింగ్ ఇంజినీర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

వికలాంగులకు బాసట

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్



విద్యార్థికి జాయినింగ్ పత్రాన్నిస్తున్న టీచర్లు

సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను బడిబాట పట్టించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా ఈనెల 13వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు సాధారణ విద్యార్థులతో సమానంగా వికలాంగ విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. మంగళవారం మండలంలో పలు గ్రామాల్లో భవిత టీచర్లు వై.శ్రీనివాసరావు, జి.సత్యనారాయణ రెండు టీములుగా విస్తృత సర్వే నిర్వహించారు. లింగాలవలస, బంగారంపేట, మరుపల్లి, మధుపాడ, ఎంజీఆర్ పురం, కెఎస్ఆర్పురం గ్రామాల్లో సర్వే నిర్వహించి ఐదుగురు వికలాంగ పిల్లలను గుర్తించామన్నారు. మరుపల్లి గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని ఎంఇఒ విమలమ్మ, గరివిడి ప్రత్యేక పాఠశాల ఉపాధ్యాయులు మూర్తి ఆధ్వర్యంలో వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి ప్రత్యేక పాఠశాలలో చేర్చే విధంగా అవగాహన కల్పించి ఒప్పించారు. మధుపాడ గ్రామానికి చెందిన వికలాంగ విద్యార్థిని కూడా గుర్తించామని తెలిపారు. అంగన్వాడి సెంటర్లో తక్కువ వయసుగల విద్యార్థులు ముగ్గురు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. చదువు వల్ల ప్రయోజనాలు, వికలాంగ విద్యార్థులకు అమలవుతున్న రాయితీలు, సదుపాయాలు గురించి వివరించారు.

కౌలు రైతులను గుర్తించండి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలోని కౌలు రైతులను గుర్తించాలని తహశీల్దార్ ఎం.శ్రీను, వ్యవసాయ శాఖ ఎడి యం.శ్యాంసుందర్ అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ గ్రామ అధికారులు, విఆర్ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు రైతులకు కౌలుదార్ కార్డులు ఇచ్చేందుకు కౌలు రైతులను గుర్తించి వారికి సీజన్ ముందే కౌలుదారు కార్డులు ఇప్పించాలని ఆదేశించారు. అన్నదాత సుఖీభవ రికార్డు వెరిఫికేషన్లో ఏవైతే ఆధార్ లింకు లేనివి, రాంగ్ ఖాతాలు వంటి రికార్డులను రెవెన్యూ సిబ్బంది కూడా పాల్గొని క్లియర్ చేసి అన్నదాత సుఖీభవ కోసం సన్నద్ధం అవ్వాలని ఆదేశించారు. ఈ పనులన్నీ ఈ నెలాఖరులోగా పూర్తి చేసి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

నాయుడు కాలనీలో పందుల స్వైరవిహారం

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక నాయుడు కాలనీలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. కాలనీలో పందులు బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో నిత్యం పందులు స్వైరవిహారం చేయడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. స్వైరవిహారం చేస్తున్న పందులలో కొన్ని పందులు ఎప్పటికప్పుడు నివాస ప్రాంతాలలో చనిపోవడంతో దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. కాలనీలో రెండు రోజుల క్రితం పంది చనిపోవడంతో దుర్వాసన రావడంతో ప్రజలు ఇబ్బందులు పడడంతో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తొలగించారు. పందులను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణ కేంద్రంలో గల కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాలలో గత 27 రోజులుగా జరుగుతున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో శిక్షణ తీసుకున్న క్రీడాకారులకు వివిధ కేటగిరీల వారీగా నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలను ఎమ్మెల్సీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఇందుకూరి రఘురాజు మంగళవారం ప్రారంభించారని చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్ కిషోర్, నారాయణ పాఠశాల ఎజిఎం శ్రీనివాస్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అలుగోలు జడ్పి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. ఈ పాఠశాలలో 2005 పదవ తరగతి బ్యాచ్కు చెందిన విద్యార్థులు కలుసుకొని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వారు చదువుకున్న రోజుల్లో అనుభవాలను నెమరు వేసుకొని 20సంవత్సరాల తరువాత కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం చదువు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. సేవా కార్యక్రమాలు చేయడానికి తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కాంతారావు, డ్రాయింగ్ టీచర్ భోజ చక్రపాణి, డ్రిల్ మాస్టర్ జగదీశ్ పాల్గొన్నారు.

ప్లాంట్ నిలుపుదల చేయాలని ఫిర్యాదు

ప్రజాశక్తి - జామి

మండలంలోని జాగారం గ్రామానికి సమీపంలోని వాటర్ ప్లాంట్ వల్ల గ్రామంలోని బోర్లు అడగంటి పోతున్నాయని, అనుమతులు లేని ప్లాంట్ను తక్షణమే నిలుపుదల చేసేలా, పంచాయతీ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. పంచాయతీ పన్ను కూడా లేకుండా ప్లాంట్ ఎలా నడుపుతున్నారని ప్రశ్నించారు. తక్షణమే ప్లాంటు నిలుపుదల చేయాలని కోరారు. ఈ ఫిర్యాదులో పలువురు గ్రామస్తులు సంతకాలు చేశారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

ప్రజాశక్తి - కొత్తవలస

ఖరీఫ్ సీజన్లో నాణ్యమైన వరి విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని కొత్తవలస ఎడిఎ ఎల్.విజయ వ్యవసాయ డీలర్లకు సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో కొత్తవలస, ఎస్.కోట, ఎల్.కోట, జామి, వేపాడ మండలాల్లో గల సీడ్ ప్రైవేట్ డీలర్స్తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఋతు పవనాలు ముందుగా వచ్చిన కారణంగా రైతులకు ఏఏ విత్తనాలు అందుబాటులో ఉంచాలి, డీలర్స్ తెచ్చే సీడ్ విషయంలో నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. డీలర్లు ఆశపడి నకిలీ విత్తనాలు తీసుకురావద్దని, నకిలీ విత్తనాలు గమనిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. డీలర్ తప్పనిసరిగా సీడ్ రిజిస్టర్లు, బిల్ బుక్స్ నిర్వహణ సక్రమంగా ఉండాలని, స్టాక్ బోర్డు పెట్టాలని, లైసెన్స్ ఉన్న డీలర్స్ మాత్రమే విత్తనాలు అమ్మకాలు జరపాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఏమైనా జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఐదు మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు రెండు ఎద్దులు మృతి

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

మండలంలోని రాజుపేటలో పిడుగుపాటుకు రెండు ఎద్దులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన రైతు కోరెడ్ల బంగారునాయుడు మంగళవారం పొలం దున్నుతుండగా పిడుగు ఉరుములు, మెరుపులు రావడంతో రైతు పరుగులు తీశాడు. ఆ సమయంలో రెండు ఎద్దులు వద్ద పిడుగు పడడంతో ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. రైతు సురక్షితంగా బయట పడడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నా, ఎద్దులు మృతితో రైతు, కుటుంబ సభ్యులు రోధిస్తున్నారు. రైతును ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎస్జిటిలకు మాన్యువల్ కౌన్సిలింగ్

ప్రజాశక్తి- మెరకముడిదాం

ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియలో తప్పనిసరిగా ఎస్జిటిలకు మాన్యువల్ కౌన్సిలింగ్ జరుగుతుందని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. పిఆర్టియు స్టేట్ అసోసియేటెడ్ ప్రెసిడెంట్ ఆల్తి రాంబాబు మంగళవారం బదిలీల ప్రక్రియలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కేంద్రంలో బాబా మెట్ట వద్ద ఉన్న ఎమ్మెల్సీ ఇంటికి వెళ్లి కలిసి విన్నవించారు. ఎస్జిటిలకు తప్పనిసరి మాన్యువల్ కౌన్సిలింగ్ అని ఎమ్మెల్సీ తనకు చెప్పినట్లు రాంబాబు తెలిపారు.

హోటళ్ల నిర్వహణపై కొరవడిన పర్యవేక్షణ

◆శుచి, శుభ్రతకు తిలోదకాలు ◆కార్పొరేట్ తరహాలో ధరలు ◆ఐటం, ధర వివరాలు లేకుండా ఇష్టారాజ్యంగా దోపిడీ ◆బిల్లులు ఇవ్వకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి

ప్రజాశక్తి-రామభద్రపురం

ఇటీవల ప్రజలు ఆహార, విహారాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ హోటళ్లు, ఫాస్ట్, పార్సెల్, ఆర్డర్లు ఫుడ్లపై ఆధార పడుతున్నారు. దీన్ని హోటళ్ల నిర్వాహకులు అవకాశంగా మలచుకొంటున్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరించి ప్రజల ఆరోగ్య నష్టాలకు కారకులవుతున్నారు. శుచి, శుభ్రతలకు తిలోదకాలు ఇచ్చి నాసిరకం, తక్కువ ధరకు దొరికే ఆహార పదార్థాలు, వంట నూనెలు వినియోగిస్తున్నారు. పశు సంవర్థక శాఖ అధికారులు ధృవీకరణ లేని మాంసాన్ని కొని వినియోగిస్తున్నారు. ఎక్కడా ధరల పట్టిక లేకుండా ఇష్టారాజ్యంగా దోపిడీ చేస్తున్నారు. బిల్లులు ఇవ్వకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

మండల వ్యాప్తంగా అల్పాహార, ఆహార హోటళ్లు, దాబాలు వంటివి సుమారు వంద వరకు ఉన్నాయి. ఒక్క మండల కేంద్రంలో 50కి పైబడి వివిధ అల్పాహార, ఆహార హోటళ్లు, దాబాలు ఉన్నాయి. ఏ ఒక్కచోటా ఐటం, ధర వివరాలు వంటివి ప్రదర్శించరు. కార్పొరేట్ స్థాయిలో ధరలు విధిస్తూ, పరిమిత స్థాయిలో మాత్రమే పదార్థాలు ఇస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ పర్యవేక్షణ, నిఘా ఉంచాల్సిన ఆహార భద్రతాధికారులు నెలలో ఒకసారైనా తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి అడ్డదారుల్లో సంపాదనే ప్రధాన ధ్యేయంగా వినియోగదారునికి విక్రయ బిల్లులు ఇవ్వడం లేదు. వాణిజ్య పన్ను రూ.వేలల్లో, లక్షల్లో పంగనామాలు పెడుతున్నారు. వంటకు కమర్షియల్ సిలిండర్లు వినియోగించాల్సి ఉన్నప్పటికీ గ్యాస్ ఏజెన్సీలను మేనేజ్ చేసుకొని రాయితీ వంట గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. రోజుకు ఎన్ని రైస్బ్యాగులు వినియోగించి ఎంతమందికి సరఫరా చేస్తున్నారో వంటి వివరాలు నమోదు కావు. ఇవన్నీ నమోదు చేస్తే రోజుకు ఎన్ని గ్యాస్ సిలిండర్లు వినియోగించారో? అందులో ఎన్ని కమర్షియల్ సిలిండర్లు కొనుగోలు చేశారో? వంటి వివరాలు తేటతెల్లం అవుతాయి. ఇక్కడ దేనికీ లెక్కా పత్రం ఉండదు. ఆహార భద్రతా అధికారులు స్థానికంగా లేకపోయినా, స్థానికంగా ఉంటున్న రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు కూడా నిరంతర తనిఖీలు నిర్వహిస్తే కొంతవరకైనా వీరి దోపిడీకి అడ్డుకట్టు పడేది.



నిబంధనలు పాటించని గుంటూరు వారి మెస్

మహానగరాలకు మించి ధరలు

మండల కేంద్రంలో ఉన్న పెద్ద హోటళ్లలో కూడా కనీస సౌకర్యాలు లేవు. టాయిలెట్స్, బేబీ ఫీడింగ్ రూమ్, పార్కింగ్ వంటివి లేకపోయినా ధరలు మాత్రం మహానగరాలకు మించి ఉన్నాయని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల భోజనానికి వాటర్ బాటిల్తో కలిపి రూ.150 వసూలు చేస్తున్నారు. మాంసాహార భోజన ధరలైతే చుక్కల్ని చూపిస్తాయి. ఇంత ధర తీసుకున్నా చికెన్ బిర్యానీ, ఫ్రైడ్ రైస్ వంటివి తక్కువ పరిమాణంలో వడ్డించడంతో అర్థాకలితో భోజనం ముగించాల్సిన దుస్థితి ఉందని భోజన ప్రియులు ఉసూరుమంటున్నారు. మరోవైపు ఈ హోటళ్లలో వాటర్ బాటిళ్లు, ఐస్ క్రీములు, పాన్, కూల్ డ్రింకులు వంటి వాటికి తయారీ తేదీ, పరిమాణం వంటి వివరాలు ఉండడం లేదు.

తప్పడం లేదు



మండల స్థాయిలో ఉన్న హోటళ్లలో మహానగరాలు, కార్పొరేట్ స్థాయిలో ధరలకు ఇక్కడ భోజనాలు ఉంటున్నాయి. ఒడిశా నుంచి వైజాగ్ వెళ్లే దారిలో నిత్యం ఇక్కడ తినే పరిస్థితి ఉంటుంది. రుచి లేని భోజనం. కనీస వసతి లేకుండా తినే పరిస్థితి. ధరకు తగ్గ తిండి లభించడం లేదు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే మాలాంటి వారికి రుచి, శుచిపై ప్రశ్నిస్తే చీత్కారాలు ఎదురవుతున్నాయి. భాష సమస్యతో ఎదురు తిరగలేక.. పట్టణంలో తినేందుకు మొగ్గు చూపుతున్నా.

\- ప్రభాకర్, శిమిలిగూడ, ఒడిశా

ధరల పట్టిక ఉంచాలి



తినే ప్రతీ పదార్థానికి ధర, ఎంత పరిమాణంలో ఇస్తారో వంటి వివరాలు ఇక్కడ లేవు. దీంతో తిన్న తరువాత నిర్వాహకులు చెప్పినట్లే డబ్బు ఇవ్వాల్సి వస్తుంది . బిల్లులు కూడా ఇవ్వడం లేదు. సంబంధిత యంత్రాంగం నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుని ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టాలి.

\- దినేష్ కుమార్, అనపర్తి

డిఆర్ డిపోకు తలుపులేవి?

●గిరిజనుల నిత్యవసర సరుకులకు రక్షణ కరువు ●11 గ్రామాల ప్రజలకు ఇక్కడ నుండే సరుకులు పంపిణీ

ప్రజాశక్తి- వేపాడ

డిఆర్ డిపోకు తలుపులు లేకపోవడంతో అందులో నిల్వ ఉంచిన నిత్యావసర సరుకులకు రక్షణ కరువైంది. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు సభలు, సమావేశాలు డిఆర్ డిపో ప్రాంతంలో నిర్వహించినా వారికి ఈ విషయం కానరాకపోవడం గమనార్హం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనాభివృద్ధికి కృషి చేస్తున్నామని గిరిజనులకు తోడ్పాటు అందించే విధంగా కార్యాచరణలు, ప్రణాళికలు నిర్వహిస్తూ గిరిజన అభివృద్ధిలో వారి ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తామని సమావేశాలలో ఊకదంపుడు ప్రసంగాలు చేయడమే తప్ప కనీసం గిరిజనుల నిత్యావసర సరుకులు అందించే ఒక భవనాన్ని కూడా సక్రమంగా ఏర్పాటు చేయకపోవడం పట్ల ఈ ప్రభుత్వాలకు ప్రజా ప్రతినిధులకు అధికారులకు గిరిజనులపై ఎంత చిత్తశుద్ధి ఉందో తేటతెల్లమవుతుంది. గిరిజనులకు అందించాల్సిన సంక్షేమ పథకాలు సక్రమంగా అమల జరిగేంత వరకూ గిరిజనుల అభివృద్ధి సాధ్యం కాదనే చెప్పాలి. అందుకు ఉదాహరణ మండలంలోని కొండగంగుపూడి గ్రామ సచివాలయ పరిధిలో గల గిరిజన గ్రామాల దుస్థితి..



తలుపులేని స్టాక్ రూమ్

మండలంలోని కొండగంగుపూడి పంచాయతీ పరిధిలో కొండగంగుపూడి, కాటయ్యగరువు, సంఘంవలస, సారవాని పాలెం, సొంటివానిపాలెం, చిట్టివానిపాలెం, బంగారయ్యపేట, సీతారాంపురం, పాతూరు, దిబ్బపాలెం గ్రామాల ప్రజలు నిత్యవసర సరుకులను కొండగంగుపూడి గ్రామంలో గల గిరిజన ప్రైమరీ కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ కాశీపట్నం ఆధ్వర్యంలో అందిస్తూ ఉంటారు. గిరిజనులకు ప్రభుత్వం అందించే నిత్యవసర సరుకులు నిల్వ చేసే డిఆర్ డిపో భవనం శిథిలావస్థకు చేరి చాలా సంవత్సరాలు అయినప్పటికీ భవన సంరక్షణ పట్టించుకోకపోవడం ఉన్న భవనానికి తలుపులు కిటికీలు లేకపోవడం భవనంలో ఉన్న లోపల ఒక్క గదిలో నిత్యవసర సరుకులు అన్నిటిని పెట్టడం వర్షాలు వచ్చినప్పుడు కొద్దిపాటి సరుకులు తడిసి పాడవడం షరా మామూలుగా జరుగుతున్నవే. ఈ డిపో ప్రాంత పరిధిలో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు సభలు సమావేశాలు ఎక్కువగా నిర్వహిస్తూ ఉంటారు. ఈ విషయమే స్థానిక గిరిజనులు వారితో ఎన్నిసార్లు ప్రస్తావించినా స్పందించిన దాఖలాలే లేవు. ఈ పాలకులకు గిరిజనుల ఓట్లు కావాలి గాని వారి అభివృద్ధి సంక్షేమానికి మాత్రం ప్రాధాన్యతను ఇవ్వరని, గిరిజనులకు కేటాయించిన నిధులు ఏమవుతున్నట్లని, పలువురు గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. డిఆర్డిపోకు తలుపులు లేకపోవడం వల్ల నిత్యావసరాలకు రక్షణ కరువై గిరిజనులు ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా డిఆర్ డిపో కోసం నూతన భవనాన్ని నిర్మించి గిరిజనులకు ప్రభుత్వాల అందించే నిత్యవసర సరుకులు సక్రమంగా అందేలా చూడాలని ఈ సచివాలయ పరిధిలో గల గిరిజన గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

టిసిఎస్కు నలుగురు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక రాజా ఆర్ఎస్ఆర్కె రంగారావు కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్)కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ చల్లా వీరేంద్ర కుమార్ తెలిపారు. టిసిఎస్ సంస్థ జాతీయ స్థాయిలో నిర్వహించే నెక్స్ట్ స్టెప్ ద్వారా కళాశాలలో బిఎస్సి కంప్యూటర్ సైన్స్ చదువుతున్న విద్యార్థులు, ఎస్ హరిత, బి.భార్గవ రాముడు, ఎస్ రవికుమార్, ఎన్, సూర్య తేజ ఎంపిక అయినట్లు, వీరికి 26వ తేదీన మెయిల్ ద్వారా టిసిఎస్ వారు ధ్రువీకరణ చేసినట్లు తెలిపారు. వీరు రాత పరీక్ష, టెక్నికల్, హెచ్ఆర్ విభాగాల్లో ప్రతిభ చూపించి ఎంపికైనట్లు తెలిపారు. ఈ విద్యార్థులను ఎంపిక దిశగా పూర్తి తర్ఫీదు, ప్రోత్సహించిన కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎస్ శరత్ కుమార్ను, విద్యార్థులను కళాశాల చైర్మన్ ఆర్వి సుజయ్ కృష్ణ రంగారావు, జాయింట్ సెక్రటరీ రావు బదరి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



వేపాడ: యోగాసనాలు వేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది

ప్రజాశక్తి- రేగిడి

యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని యోగా శిక్షకులు శ్రీమన్నారాయణ, ఎంపిడిఒ శ్యామల కుమారి, పిఒపి ఆర్డిఎ సత్యనారాయణ అన్నారు. ఉంగరాడ మెట్టలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం నిర్వహించిన యోగా మహోత్సవాల్లో భాగంగా వారు మాట్లాడుతూ, యోగ సాధన ద్వారా శరీరానికే కాకుండా మనస్సుకు కూడా ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ ఆసనాలు చేశారు. యోగ సాధనను నిత్య జీవితంలో మలుచుకోవాలని, తద్వారా ఆరోగ్యంగా, చురుకుగా జీవించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ ఎఒ నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.



రేగిడి: యోగాలో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు

వేపాడ: వచ్చే నెల 21న అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగాసనాలు ప్రారంభించారు. ఎంపిడిఒ సూర్యనారాయణ సారథ్యంలో మండల విద్యా శాఖాధికారులు నాగభూషణ రావు, బాల భాస్కరరావులతో పాటు ఎంపిడిఒ ఆఫీసు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వందలాది ఉద్యోగులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

బాడంగి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని ఎంపిడిఒ శంబంగి రామకృష్ణ అన్నారు. బాడంగిలో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. యోగాపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ చేశారు. యోగాతో ఆరోగ్యంగా ఉండగలమని, ఆసనాలు వేసేందుకు ముందుకు రావాలని ఉద్యోగులు పిలుపినిచ్చారు.

బొబ్బిలి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండగలమని టిపిఆర్ఒ మామిడి జగన్మోహనరావు, యోగా శిక్షకులు అన్నారు. స్థానిక పొట్టి శ్రీరాములు మున్సిపల్ పాఠశాలలో మంగళవారం యోగాంధ్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యంగా ఉండగలమని, యోగాపై ఆసక్తి చూపాలని ఉద్యోగులు, ప్రజలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ

రామభద్రపురం: యోగాపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని బొబ్బిలి డివిజన్ డిఎల్టిఒ కిరణ్ కుమార్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం యోగాపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి 31 వరకు గ్రామాల్లో యోగాపై పోటీలు నిర్వహించాలన్నారు. జూన్ 2 నుంచి 7 వరకు మండల స్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. గ్రామంలో 9 మంది టిఒటిలను ఎంపిక చేసి వారి చేత శిక్షణా తరగతులు నిర్వహించాలని తెలిపారు. అనంతరం బైపాస్ రోడ్డులో భారీ ఎత్తున మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రత్నం, ఇఒపిఆర్డి వెంకట రమణ, ఎపిఒ త్రినాధరావు, ఎపిఎం అన్నపూర్ణ పాల్గొన్నారు. స్థానిక జిల్లాపరిషత్ పాఠశాలలో యోగా కార్యక్రమం నిర్వహించారు.

కౌలురైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు

ప్రజాశక్తి - జామి

జామి గ్రామానికి చెందిన కౌలు రైతు గొర్లి ఎర్ని నాయుడు మృతిని ప్రభుత్వం కౌలు రైతు ఆత్మహత్యగా నమోదు చేసి, అప్పుల ఊబిలో కూరుకు పోయిన రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం జామి గ్రామంలో మృతిని కుటుంబాన్ని పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, కౌలు రైతు కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించి, అప్పులు ఊబిలో ఉన్న కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎర్నాయుడు 70 సెంట్లు సొంత భూమి, 4 ఎకరాలు కౌలుకి వ్యవసాయం చేస్తున్నాడని అన్నారు. సుమారుగా రూ. 15 లక్షల వరకు అప్పుల్లో కూరుకుపోయాడన్నారు. సొంత భూమి ఉన్నా, అగ్రహారం కావడంతో ప్రయివేటు అప్పులు బారిన పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా అగ్రహారం భూ సమస్య పరిష్కారం కాకపోవడం వల్ల, అనేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అధికారులు గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఒక పక్క ఇద్దరి పిల్లల చదువులు, మరోవైపు తల్లి సీతమ్మ పక్షవాతంతో బాధపడదం, వీటన్నింటి మించి వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడం అన్ని కలగలిపి ఎర్నాయుడు ఆత్మహత్యకు కారణం అయ్యిందని, కాబట్టి ప్రభుత్వమే ఆ కుటుంబాన్ని ఆదుకునే విదంగా ఆర్థిక సాయం అందించాలని కోరారు. రాంబాబు వెంట రైతు సంఘం నాయకులు నారాయణరావు, వెంకటరావు, కృష్ణ, స్థానిక పెద్దలు తాత బాబు, శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాంబాబు

విద్యార్థులకు క్విజ్ పోటీలు


ప్రజాశక్తి - రామభద్రపురం

వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో ఎంఇఒ తిరుమల ప్రసాద్ లైబ్రేరియన్ సత్యవాణి ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు.

దర్యాప్తునకు సహకరించని సభ్యులు

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలోని అలజంగి గ్రామంలో అక్రమాలు జరిగాయని ఫిర్యాదుల మేరకు గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న దర్యాప్తు ముందుకు సాగడం లేదు. దర్యాప్తులో ఆయా పొదుపు సంఘాల మహిళలు పాల్గొనకుండా పురుషులు హాజరై తెలియని విషయాలు చెబుతున్నట్లుగా తెలిసింది. మహిళలు పోపుల డబ్బాల్లో దాచుకున్న డబ్బులు పొదుపు చేసి తీసుకొన్న అప్పులు సక్రమంగా నిజాయతీగా కడతారనే ఉద్దేశ్యంతో మహిళా సంఘాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అలాంటి పొదుపు సంఘాల్లో పురుషుల జోక్యంతో అలజంగి గ్రామంలో సక్రమంగా దర్యాప్తు నిర్వహించకుండా వారు చెప్పినట్లే దర్యాప్తు నిర్వహించాలని దర్యాప్తు అధికారులతో వాగ్వివాదానికి దిగుతున్నారు. సక్రమంగా దర్యాప్తుకు సహకరించకపోవడంతో పొదుపు సంఘాలకు ముందు ముందు రావాల్సిన అప్పులు వివిధ రకాల ప్రభుత్వ రాయితీలు రాకుండా పొయే అవకాశం ఉంది. మంగళవారం జరిగే దర్యాప్తులో సత్యసాయి, సిద్ధివినాయక పొదుపు సంఘాల సభ్యులు సంఘానికి ఒకరు చొప్పున మాత్రమే పాల్గొన్నారు. వారితరుపున పురుషులు పాల్గొనడంతో దర్యాప్తు ముందుకు సాగలేదు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ ఆదయ్య, ఎపిఎంలు భాగ్యలక్ష్మి, సత్యనారాయణ, విజయలక్ష్మి, దేవుడు, హేమలత, సిసిలు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలను విచారిస్తున్న అధికారులు